RNI NO. TELTEL/2022/83470

manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 2. సంచిక :194 | గురువారం 25 ఏప్రిల్ 2024 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

**సూర్యాపేట,మనసాక్షి:** కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొట్టడంతో అందులో ఉన్న ఓ చిన్నారితో సహా ఆరుగురు చనిపోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. ఆరుగురు ఘటనాస్థంలోనే చనిపోయారు. గాయపడిన ఇద్దరిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.





2లో

## నేడు తెలంగాణకు అమిత్ షా రాక

సిద్దిపేటలో ప్రచార సభ ఖరారు

నెలాఖరులో ప్రధాని మోదీ పర్యటన



2లో

## కులగణన హామీపై బిజెపిలో భయం

ఆర్థిక అసమానతలు గుర్తించడానికే సర్వే

కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సతకం దీనిపైనేనని వ్యాఖ్య

ఢిల్లీలో జరిగిన సదస్సులె రాహుల్ స్పష్టీకరణ

# కాళేశ్వరంపై చర్చిద్దాం..రా

"కాళేశ్వరానికి పోదాం. అక్కడే కూర్చుందాం. నిపుణులను పిలిపిద్దాం. తెలంగాణ సమాజం వస్తుంది. మీకు దమ్ము, ధైర్యం, నీతి, నిజాయతీ ఉంటే కాళేశ్వరం వద్దే చర్చ పెడదాం."

ప్రాజెక్టు వద్దకు రావాలని కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

పంద్రాగస్టులోపే రుణమాఫీ చేస్తామని వెల్లడి

హరీశ్‌రావు రాజీనామా పత్రం సిద్ధంగా పెట్టుకోవాలి

మతచిచ్చు రేపడమే భాజపా లక్ష్యం

### వరంగల్ సభ, సికింద్రాబాద్ రోడ్‌షోల్లో సీఎం

*కేసీఆర్, హరీశ్‌రావులకు అధికార మత్తు ఇంకా దిగిందో లేదో తెలియదు. పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్.. ప్రభుత్వం మారాక అసెంబ్లీకి రాలేదు. సమస్యలపై మాట్లాడలేదు. ప్రభుత్వానికి సలహాలూ ఇవ్వలేదు. తన మెదడును రంగరించి, రక్తాన్ని ధారపోసి కాళేశ్వరం కట్టారట. అలా కట్టారో లేదో.. ఇలా కూలిపోయింది. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ కట్టించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం, శ్రీరామసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, జూరాల, దేవాదుల లాంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కట్టాం. మీరు కట్టినవి, మేం కట్టినవి.. ఒక్కసారి చూసొద్దాం రండి.*

**-సీఎం రేవంత్‌రెడ్డి**



వరంగల్,,మనసాక్షి: "కాళేశ్వరానికి పోదాం. అక్కడే కూర్చుందాం. నిపుణులను పిలిపిద్దాం. తెలంగాణ సమాజం వస్తుంది. మీకు దమ్ము, ధైర్యం, నీతి, నిజాయతీ ఉంటే కాళేశ్వరం వద్దే చర్చ పెడదాం. మీరు కట్టిన అద్భుతమేందో, అది తెలంగాణకు ఎలా ఉపయోగపడుతుందో వివరించండి" అని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. బుధవారం హనుమకొండ జిల్లా మడికొండలో నిర్వహించిన ఓరుగల్లు జనజాతర సభలో, సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "రామప్ప శివుడు, సమ్మక్క సారలమ్మ, భద్రకాళీ అమ్మవారి సాక్షిగా

మిగతా 2లో



# కెసిఆర్ భయపడతాడా..?

భయపడితే తెలంగాణ వచ్చేదా..!

420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు

ముఖ్యమంత్రి భాష జుగుప్సాకరంగా ఉంది

నల్లగొండ జిల్లా మంత్రులు కేసీఆర్ ను తిట్టేందుకే ఉన్నారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రోడ్ షోలో కేసీఆర్

ప్రారంభమైన కెసిఆర్ బస్సు యాత్ర

*కేసీఆర్ పక్కకు పోగానే అన్ని బంద్ అయినాయ్.. కేసీఆర్ తిట్టి పబ్బం గడుపుతున్నారు. అన్నదాతలు సపోర్ట్ లేకుండా ఏది నడవదు. మేము అధికారంలో వున్నప్పుడు మోడీ తో కోట్లాడి ధాన్యం కొనేలా చేసినమన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ ను గెలిపిస్తే నే అన్ని అమలు అయితాయి. కేసీఆర్ ఆనవాళ్లు తీసేస్తాం అంటున్నారు. అది సాధ్యం అవుతుందా.. బిడ్డ నోరు అదుపులో పెట్టుకో.... అంబెడ్కర్ జయంతి రోజున హైదరాబాద్ లోని అంబెడ్కర్ విగ్రహానికి అవమానం చేశారు... మరి ఇప్పుడు న్యాయం జరగాలి....తప్పకుండా మన రాజ్యం వస్తది. డౌట్ లేదు...తప్పకుండా బీ ఆర్ ఎస్ గెలవాలి... మళ్ళీ మన హక్కులను సాదించుకుందామన్నారు. రోడ్ షో కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకల్ల జగదీశ్ రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు ,నల్లగొండ పార్లమెంటు అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు రవీంద్ర కుమార్, గాదరి కిషోర్, బడుగుల లింగయ్య యాదవ్ , ఎన్ వి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, నాయకులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్న భీమోజి నాగార్జున చారి తదితరులు పాల్గొన్నారు.*



2లో





2లో

# వలసపక్షులను నమ్ముకుంటే మోసమే..

మల్కాజిగిరికి రేవంత్ చేసింది సున్నా

మల్కాజిగిరి ప్రచారంలో కెటిఆర్





## తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం ఉత్తీర్ణత

మళ్లీ బాలికలదే పైచేయి

2లో

# సుప్రీం దెబ్బతో దిగివచ్చిన పతంజలి

**క్షమాపణలు కోరుతూ భారీ ప్రకటనలు**



**న్యూఢిల్లీ,మనసాక్షి:** పతంజలి ప్రకటనల వివాదంలో సుప్రీం ఆదేశాలతో దిగివచ్చింది. భారీ ప్రకటనను ఇచ్చి క్షమాపణలు కోరింది. ఎన్నిసార్లు మందలించినా తీరు మార్చుకోవడం లేదంటూ సుప్రీంకోర్టు ఇప్పటికే అక్షింతలు వేసింది. ఆ తరవాత రామ్‌దేవ్ బాబాతో పాటు ఆచార్య బాలకృష్ణ స్పందించారు. కోర్టుకు క్షమాపణలు చెప్పారు. అయితే...పేపర్లలో పతంజలి ప్రకటనలు ఏ సైజ్‌లో అయితే వేస్తారో అదే సైజ్‌లో క్షమాపణలు చెబుతూ ప్రకటనలు వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే ఓ రోజు యాడ్స్ వేసిన పతంజలి వరుసగా రెండోరోజూ ప్రకటన ఇచ్చింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు అందరినీ క్షమాపణలు కోరుతున్నట్టు అందులో పేర్కొంది. 'ఇప్పటి వరకూ మా ప్రకటనల్లో వచ్చిన తప్పులకు క్షమాపణలు కోరుతున్నాను. ఇలాంటి పొరపాటు మళ్లీ జరగకుండా జాగ్రత్తపడతాం. ఇకపై నిబద్ధతగా ఉంటాం అని పతంజలి ప్రకటించారు. సుప్రీంకోర్టు దెబ్బకి దిగొచ్చిన పతంజలి, క్షమాపణలు కోరుతూ న్యూస్‌పేపర్‌లలో భారీ ప్రకటనలు చేసింది.

## బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

అంతర్జాతీయ ప్రభావంతో దిగివచ్చిన రేట్లు



2లో

## రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తా!

హామీలు అమలు చేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా

మళ్లీ ఎన్నికల్లో పోటీ కూడా చేయను

సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి

2లో

రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు.



# బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

**న్యూఢిల్లీ:** బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట దక్కింది. ఇన్నాళ్లూ భారీగా పెరిగిన బంగారం ధరకు కాస్త బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా గిరాకీ తగ్గడంతో పసిడి ధర దిగి వచ్చింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర క్షీణించడంతో దేశీయంగా వెయ్యి రూపాయలకు పైనే తగ్గింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి బులియన్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.74,300గా (పన్నులు కలుపుకొని) ఉంది. వెండి కిలో ధర సైతం రూ.2 వేల వరకు తగ్గింది. 83,300 వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సు 2322 డాలర్లుగా ఉంది. ఒక్కరోజులోనే దాదాపు 50 డాలర్లకు పైగా తగ్గింది. పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ఇటీవల పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణమయ్యాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి బంగారంవైపు మదుపరులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఘర్షణలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరికొంత కాలం పాటు అధిక వడ్డీ రేట్లను కొనసాగించే అవకాశాలు కనిపిస్తుండడంతో పసిడికి గిరాకీ తగ్గింది. రిస్క్‌తో కూడిన పెట్టుబడిన సాధనాల వైపు మదుపరులు పెట్టుబడులు మళ్లిస్తుండడం, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు ట్రేడర్లు మొగ్గు చూపడంతో బంగారం ధర తగ్గడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీలో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

# రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తా

**సంగారెడ్డి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది తొండి రాజకీయమని.. ఆయన ఇచ్చిన సవాలును తాను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హరీష్ రావు సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతు ఋణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయనని.. తనకు పదవులు ముఖ్యం కాదని అన్నారు. రైతు రుణమాఫీ, ఇచ్చిన హామీలు చేయకపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా..? అని ప్రశ్నించారు. ఈ విషయాలపై తాను శుక్రవారం (ఎల్లుండి) అసెంబ్లీ ముందు ఉన్న అమరుల స్థూపం వద్దకు చర్చకు వస్తానని.. సీఎం రేవంత్ కూడా రావాలని హరీష్ రావు అన్నారు. కాగా రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విసురుతున్న సవాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూటిగా స్పందించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానని, మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రతి సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు. లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవాలైన బావోజీ, సేవాలాల్‌ల సాక్షిగా ఆగస్టు 15లోగా అది జరుగుతుందని పునరుద్ఘాటించారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్‌రావు తన మామ కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తాను రుణమాఫీ చేస్తే.. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని హరీశ్‌కు సీఎం ప్రతి సవాల్ విసిరారు. మంగళవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తాము వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలకుగాను ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కేసీఆర్ పదేళ్లలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి.. ఇలా ఏ హామీనీ కేసీఆర్ అమలు చేయలేదన్నారు. రెండుసార్లు చేసిన రుణ మాఫీ మిత్తికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. పదేళ్లు ఏ హామీ అమలు చేయని కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో కోదండం వేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగుబోతు అప్పుల సంసారంలాగా రూ.3,900 కోట్ల లోటు బ్జడెట్‌ను తనకు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అప్పగించారని, బాధ్యతగా వ్యవహరిస్తూ నాలుగు నెలల్లో రూ. 26 వేల కోట్ల కిస్తీలు, మిత్తి చెల్లించానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతీ నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి రూ.1369 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని వివరించారు. రూ.500లకు సిలిండర్ పథకం కింద రాష్ట్రంలో 40 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుస్తున్నామని, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు పథకం కింద 44 లక్షల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకపోతే తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 22,500 కోట్లు కేటాయించి 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. రైతుల రుణాల వసూళ్ల కోసం డీసీసీబీ తదితర బ్యాంకులు రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఏ అధికారి ఒత్తిడి చేసినా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అసలు, మిత్తి నయా పైసలతో సహా చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతుల నుంచి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రూ.500 బోనస్‌గా ఇచ్చి మరీ ప్రతీ గింజను కొంటామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# కాళేశ్వరంపై చర్చిద్దాం.. రా



చెబుతున్నా. పంద్రాగస్టులోపు నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తా. అలా చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పిస్తానని హరీశ్ సవాల్ విసిరారు. ఆయన తన జేబులో రాజీనామా పత్రం సిద్ధంగా పెట్టుకోవాలి.

మోదీ, కేసీఆర్‌లు.. నాణేనికి బొమ్మాబొరుసులు

మోదీ, కేసీఆర్ నాణేనికి బొమ్మాబొరుసు లాంటివారు. ఇద్దరూ కలిసి తెలంగాణకు అన్యాయం చేశారు. రాష్ట్రానికి సోనియా గాంధీ ఇచ్చిన విభజన హామీలేవీ మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించక ఈ ప్రాంతానికి మోదీ ద్రోహం చేశారు. కాజీపేటలో పెట్టాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మహారాష్ట్రలోని లాతూర్‌కు తరలించుకుపోయారు. ట్రిపుల్‌ఐటీ, ఐటీఐఆర్ ఇవ్వలేదు. నాడు మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలివ్వాలి. పార్లమెంటులో నేనడిగిన ప్రశ్నకు 7,21,680 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చామని సమాధానం చెప్పారు. ఈరోజు ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నారు? అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు బుద్ధిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి బుద్ధిచెప్పాలి. ఈ ఎన్నికల్లో భారాసకు ఎక్కడా డిపాజిట్ కూడా రాదు.

**మతం పేరుతో భాజపా విద్వేషాలు**

భాజపాకు మతపిచ్చి పట్టుకుంది. దేశంలో అన్ని మతాలవారు కలిసిమెలిసి జీవిస్తుంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాళ్ల ఆస్తులు వీళ్లకిస్తుందని, ఒకరి రిజర్వేషన్లు తగ్గించి ఇంకొకరికి ఇస్తుందని దుష్ప్రచారం చేస్తూ మతచిచ్చు రేపడమే భాజపా నాయకుల లక్ష్యం. అందరూ కలిసిఉండటం మోదీకి ఇష్టం లేదు. గ్రామాల్లో పీర్ల పండగను ముస్లిం సోదరులతో కలిసి జరుపుకొంటాం. క్రిస్మస్ నాడు చర్చిలకు వెళ్తాం. ఇందుకు విరుద్ధంగా భాజపా నాయకులు ఓట్ల కోసం గోడలపైకి శ్రీరాముడిని తెచ్చారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వాళ్లే చేశారా? మనం చేయలేదా? మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్న భాజపాను ఓడించాలి.

**కిషన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టయినా తెచ్చారా?**

తెలంగాణ ఏర్పడకముందు కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లలో హైదరాబాద్‌కు ఐటీ, ఫార్మా పరిశ్రమలు, అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చాయి. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఓఆర్ఆర్, మెట్రోరైలు తీసుకొచ్చారు. రాజధానికి కృష్ణా, గోదావరి జలాలను తెచ్చారు. ఐదేళ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది శూన్యం. మూడేళ్ల క్రితం హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో వరదలొచ్చినప్పుడు అప్పట్లో హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకురాలేదు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టయినా తెచ్చారా? ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు వస్తున్నవారిని గుజరాత్‌లో ఏర్పాటు చేయండంటూ కేంద్ర ప్రభుత్వం బెదిరిస్తే అడ్డుకోలేదు. రైల్వేలను ప్రైవేటుపరం చేస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? రైతుల భూములు ఆక్రమించిన అరూరి రమేశ్‌కి భాజపా వరంగల్ టికెటిచ్చింది. కడియం శ్రీహరి కాంగ్రెస్ టికెట్ అడగలేదు. నిజాయతీ ఉన్నవారు ప్రభుత్వం వెంట ఉండాలని.. ఆయన వద్దకు నేనే పార్టీ పెద్దలను పంపించి టికెట్ ఇస్తామని ప్రతిపాదించా. వరంగల్‌ను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తా. అంతర్జాతీయ విమానాశ్రయం తీసుకొస్తా.

**సికింద్రాబాద్‌లో ఏ పార్టీ వారు గెలిస్తే వారిదే కేంద్రంలో అధికారం**

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఏ పార్టీవారు గెలిస్తే.. ఆ పార్టీయే కేంద్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్‌ల విషయంలో ఇదే జరిగింది. దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు. దానంను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తే పార్టీ అగ్రనేతలను ఒప్పించి కేంద్రంలో మంత్రి పదవి ఇప్పించేందుకు కృషి చేస్తాను. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ కోసం భాజపాతో కేసీఆర్ చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకే పద్మారావుగౌడ్‌కు టికెట్ కేటాయించారు. పీజేఆర్, దానం నాగేందర్‌లా పద్మారావు మంచివారు. కానీ, కేసీఆర్‌ను నమ్ముకుంటే నట్టేట మునుగుతారు. పద్మారావు నామినేషన్ వేసేందుకు వెళ్తే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో, కేటీఆర్ జూబ్లీహిల్స్ అతిథిగృహంలో సేదతీరారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకొంటున్న భారాస చేసిందేమీ లేదు. పురపాలకశాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్.. నగరంలో నీటి కొరత ఏర్పడకుండా ఏవైనా కొత్త ప్రాజెక్టులు తీసుకువచ్చారా?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

ఓరుగల్లు జనజాతర సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకొస్తే దాన్ని నేడు మోదీ తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వరంగల్ భారాస నేతలపై విచారణ జరిపి.. కటకటాల్లోకి పంపాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగిస్తూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లోని హామీలు అమలు చేయడంతో కేసీఆర్‌కు భయమేస్తోందన్నారు.

కార్యక్రమాల్లో ఎంపీ అభ్యర్థులు కడియం కావ్య(వరంగల్), దానం నాగేందర్(సికింద్రాబాద్), వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌధరి, తెజస అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్విని, నాగరాజు, నేతలు అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్, రోహిణ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, దానం నాగేందర్‌లు సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ సమర్పించారు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్స్‌కు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు.

ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇక జిల్లాల వారీగా చూసుకుంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58 శాత ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లాకు ప్రథమ స్థానం, 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి.

# వలసపక్షులను నమ్ముకుంటే మోసమే

**మేడ్చల్ మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కేటీఆర్ రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో రేవంత్ రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంతో ఇచ్చింది. పీసీసీ, సీఎం పదవులు రావటానికి మల్కాజ్‌గిరి ప్రజలే కారణం. అలాంటి రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు ఏం చేయలేదు. పార్లమెంట్‌లో పత్తా లేకుండా పోయిండు. ప్రజలకు కష్టం వస్తే కనబడకుండా పోయిండు. ఈ వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరు. మీకు 24 గంటలు అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి అని ప్రజలను కేటీఆర్ కోరారు.



పదేళ్ల అభివృద్ధి కేసీఆర్ పాలన.. వంద రోజులు అబద్ధం రేవంత్ రెడ్డి పాలన అని కేటీఆర్ పేర్కొన్నారు. బడే భాయ్ మోదీ మనకు బడా మోసం చేసిండు. చోట భాయ్ రేవంత్ రెడ్డి మనల్ని ఇక్కడ మోసం చేసిండు. వంద రోజుల్లో అందరికీ అన్ని చేస్తా అంటూ చోటా భాయ్ మోసం చేసిండు. గద్దెనెక్కిన వెంబడే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తా అన్నాడు. రుణమాఫీ అయ్యిందా? తులం బంగారం వచ్చిందా? మహిళలకు రూ. 2500 వచ్చినయా? పైన పెద్ద మోసగాడు కింద చిన్న మోసగాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి మోసం పార్ట్ -1 అనే సినిమా చూపించిండు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు మోసం పార్ట్ -2 సినిమా చూపిస్తున్నాడు. ఎక్కడ పోతే అక్కడ దేవుళ్ల మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తా అంటున్నాడు. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడి తప్పు. రెండో సారి మోసం పోతే మోసపోయిన వారిదే తప్పు. ఇప్పుడు ప్రజలంతా కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు అని కేటీఆర్ తెలిపారు.

# కెసిఆర్ భయపడతాడా..?

**మిర్యాలగూడ, ఏప్రిల్ 24, మన సాక్షి :**



కెసిఆర్ ని జైల్లో వేస్తాడంట.. జైల్లో వేస్తానంటే కేసీఆర్ భయపడతాడా..? భయపడితే తెలంగాణ వచ్చేదా ..? అంటూ కేసిఆర్ ఉద్యమ తరహాలో స్పీచ్ ఇచ్చారు. కెసిఆర్ బస్సు యాత్ర బుధవారం ప్రారంభమైంది ఈ సందర్భంగా తెలంగాణ తల్లికి ఉద్యమాభి వందనాలు తెలియజేసి హైదరాబాదులో బస్సు యాత్రను ప్రారంభించారు. అనంతరం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఆయన రోడ్ షో నిర్వహించారు. రోడ్ షో కు భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాటలు జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడే మాటల తీరు అదేనా అంటూ విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ను జైల్లో వేస్తానంటాడు.. పేగులు తీసి మెడలో వేసుకుంటాడట.. గుడ్లు పీకి గోటి లాడుతాడట. ఇదేనా ముఖ్యమంత్రి తీరు మాట్లాడేది అంటూ కేసిఆర్ విమర్శించారు. 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని వాటిని అమలు చేయడం లేదన్నారు. డిసెంబర్ 9వ తేదీన తొలి సంతకం రుణమాఫీ పై పెడతానని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు రుణమాఫీ ఇవ్వలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు గోసపెడుతున్నారని అన్నారు. 1956 నుంచి మనకు శత్రువులు కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇచ్చిన హామీలలో రైతుబంధు ఇవ్వడంలేదని, రుణమాఫీ చేయలేదని, నిరుద్యోగ భృతి మాటే లేదని, పేదవారి పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదు అన్నారు. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు కు అన్యాయం చేస్తుంటే అప్పుడు కోదాడ నుండి హాలియ వరకు పాదయాత్ర చేసినాను. ఇవ్వాళ మళ్ళీ అన్నదాతలు దిగాలు పడి బాధలో వున్నారన్నారు. ఇవ్వాళ ఇరిగేషన్ మంత్రి ఈ జిలాల్లోనే వున్నాడు.. దద్దమ్మల్లాగా కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పారు. నల్లగొండ జిల్లా మంత్రులు కేసీఆర్ ను తిడుతూ బబ్బం గడుపుతున్నారని అన్నారు. రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతా అంటున్నారు ఓ మంత్రి.. అన్నదాతలు చెప్పులు ఇంకా గట్టిగా వుంటాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో 18 గంటల కరెంటు రైతులకు అందజేశామని ఇప్పుడు, కరెంటు లేకుండా పోయిందని, ఇంటింటికి భగీరథ నీళ్లు ఇచ్చామని ఇప్పుడు ఆ నీళ్లు ఇవ్వలేకపోతున్నారని అన్నారు.

# కులగణన హామీపై బిజెపిలో భయం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సామాజిక-ఆర్థిక సర్వే' హామీపై ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుకే సర్వే చేస్తామని తాము చెబుతున్నామని అన్నారు. సర్వే అనంతరం చర్యలు తీసుకుంటామని తాము చెప్పలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సంపద సర్వే' హామీ రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రజల సంపద, నగల్ని దోచుకుని అందరికీ పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోందంటూ ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు కూడా మోదీ విమర్శలకు దగ్గరగా ఉన్నాయనే అభిప్రాయానికి తావిచ్చింది. అమెరికాలో వారసత్వ పన్ను ఉందని, ఆ ప్రకారం ఒక వ్యక్తి మరణం తర్వాత ఆయన సంపదనలో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు వెళ్తుందని, తక్కిన 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఇది తనకు న్యాయంగానే అనిపిస్తోందని పిట్రోడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సంపద సర్వే' హామీపై కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. ఢిల్లీలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణనకు ఎందుకు బీజేపీ వారు భయపడుతున్నారని ప్రశ్నించారు. సర్వేతో అసలు సమస్య ఏంటో, ఎక్కడుందో తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలోకి రాగానే తొలి నిర్ణయం దీనిపైనే ఉంటుందన్నారు. సమాజంలో అన్యాయానికి గురవుతున్న 90 శాతం మందికి న్యాయం కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుక సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన ఉద్దేశమని చెప్పారు. దేశభక్తులమని చెప్పుకునే వారికి సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన గురించి భయమెందుకని ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత చేపట్టనున్న కీలకమైన సర్వే ఇదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రధానిలో ఆందోళన మొదలైందని చెప్పారు. 90 శాతం భారతీయులకు అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేయాలని తాను చెప్పినప్పటి నుంచి ప్రధాని, బీజేపీ తనపై దాడి మొదలుపెట్టినట్టు చెప్పారు. కచ్చితంగా తమది (కాంగ్రెస్) రివల్యూషనరీ మేనిఫెస్టో అని రాహుల్ స్పష్టం చేశారు.

# నేడు తెలంగాణకు అమిత్ షా రాక

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎన్నికలపై కమలం పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. తెలంగాణ లో బీజేపీ అగ్రనేతలు రసగా పర్యటించనున్నారు. ఈ క్రమంలో గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా వస్తున్నారు. గురువారం మధ్యహాన్నం 12 గంటలకు సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. కాగా తెలంగాణలో ఐదు బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నారు.

గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు వస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. గురు, శుక్రవారాలు బన్సల్ తెలంగాణలో పర్యటిస్తారని పెద్ద సభలు, సమావేశాల కంటే డోర్ టు డోర్ ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మే నెల 13వ తేదీ వరకు నిర్మాణాత్మకంగా ప్రచారం సాగుతుందని చెప్పారు. ఎన్నిలకు కేవలం రెండు వారాలు ఉండడంతో బీజేపీ హైకమాండ్ తెలంగాణపై దృష్టి పెట్టింది. వరుసగా పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారానికి మూడు లేదా నాలుగు సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కేంద్రమంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు. సిద్ధిపేటలో జరగనున్న భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని ప్రసంగిస్తారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 30, మే 3, 4 తేదీలలో మోదీ పర్యటించనున్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని వివిధ రంగాల ప్రముఖులతో సమావేశం కానున్నారు. మే 4వ తేదీన నారాయణ పేట్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు.

ఎన్నిలకు కేవలం రెండు వారాలు ఉండడంతో బీజేపీ హైకమాండ్ తెలంగాణపై దృష్టి పెట్టింది. వరుసగా పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారానికి మూడు లేదా నాలుగు సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో కేఎల్ఎన్ ప్రభంజనం



**మిర్యాలగూడ, మన సాక్షి :**

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన కె.ఎల్.ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. గత 18 సంవత్సరాలుగా కేఎల్ఎన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందుతున్నారు. బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కేఎల్ఎన్ విద్యార్థులు ప్రథమ ద్వితీయ సంవత్సరాలలో అత్యధిక మార్కులు సాధించి ఈ సంవత్సరం కూడా స్టేట్ ర్యాంకులు సాధించి కె.ఎల్.ఎన్ నెంబర్ వన్ అని నిరూపించారు.

**ఫస్ట్ ఇయర్ ఎంపీసీ లో :**
ఎస్.కె నౌషిన్ 467
కె హాసిత 466
ఎస్.కె అఫన్ 466
మనోజ్ఞ 466 తో పాటు ఇంకా 20 మంది విద్యార్థులు 460 మార్కులపైగా సాధించారు.

**బైపీసీ ఫస్టియర్ లో :**
అంజుమ్ 435
సమీ కసిఫా నూరిన్ 431

**సెకండ్ ఇయర్ ఎంపీసీలో :**
బి చరిత 985
సిహెచ్ పవన్ 982
ఆర్ శ్రావణ్ 981
గీతాంజలి 980 మార్కులు సాధించారు.

**సెకండ్ ఇయర్ బైపిసి లో :**
పి సంజన 986
ఎన్ సమీర్ 983 మార్కులు సాధించి ఎప్పటికీ నెంబర్ వన్ అని నిరూపించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ కిరణ్ కుమార్ డైరెక్టర్స్ నరేందర్ రెడ్డి ,పి ఎల్ ఎన్ రెడ్డి, హనుమంత రెడ్డి, చైతన్య లు అభినందించారు.

## సెంటిమెంట్ జాన్స్ హై స్కూల్ విద్యార్థి టాప్ ర్యాంక్

**మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 24, మన సాక్షి:**



మిర్యాలగూడ పట్టణంలోని సెంటిమెంట్ జాన్స్ హై స్కూల్లో పాఠశాలలో విద్యను పూర్తి చేసుకొని పదో తరగతిలో 10 జి.పి సాధించి బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో పి.లిఖిత 989/1000 మార్కులతో టాప్ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష,ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## నేడు చాపు లాల్ జాతర

**చివ్వెంల, ఏప్రిల్ 24 (మన సాక్షి ):**

ఈనెల 25 నుంచి 26 వరకు చివ్వెంల మండలం పులితండా గ్రామపంచాయతీ గుడి తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ చాంపులాల్ జాతర జరగనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్రవంతి బుధవారం నాడోక ప్రకటనలో తెలిపారు. గురువారం జాతర మొదటి రోజు చంపు లాల్ వంశస్థులు మొక్కులు చెల్లించుకోనుండగా శుక్రవారం జాతర ముగింపు జరగనుంది. జాతర సందర్భంగా గ్రామపంచాయతీ వివిధ రకాల వ్యాపారాల కోసం వేలంపాటలు నిర్వహించగా పంచాయితీకి ఆదాయం సమకూరింది. గత సంవత్సరం జరిగిన జాతరలో ఎంపీ ఓ సొంత ఆదేశాలతో నిధులను దుర్వినియోగం చేయగా ఉన్నతాధికారులు స్పందించి నిధులు రికవరీ చేశారు. ఈసారైనా జాతర సజావుగా నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డ్..

**హత్నూర, ఏప్రిల్ 24,మన సాక్షి:**




స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీతగా దేవులపల్లి నవీన్ కుమార్ కు బుధవారం

హైదరాబాద్ లో డాక్టర్ దేవులపల్లి రామాంజిరావు కళామందిరం స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు హత్నూర మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన దేవులపల్లి నవీన్ కుమార్ అందుకోవడం జరిగింది. ఈ అవార్డు అందుకున్నందుకు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆకుల రమేష్ కి ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపాడు.

## ఏపీలో మాఫియాల స్వైర విహారం

**విశాఖపట్నం:,మనసాక్షి:** ఏపీ అభివృద్ధికి అన్ని రకాలుగా కేంద్రం సహకరిస్తుంటే ఇక్కడ అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం మాత్రం లెక్కకు మించి అప్పులు చేసిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. విశాఖలో మేధావులతో జరిగిన సమావేశంలో ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి భరత్, ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూడా వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు."వైకాపా ప్రభుత్వం మొత్తం రూ. 13.50లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై రూ.2లక్షల రుణభారం మోపింది. ఖజానా ఖాళీ చేసి పన్నుల భారం ప్రజల మీద వేసింది. రాష్ట్రాన్ని, విశాఖను డ్రగ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా మార్చింది. ల్యాండ్, హ్యూమన్ ట్రాఫికింగ్, మైనింగ్ మాఫియాలు రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో పూర్తిగా కూరుకుపోయింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అభివృద్ధికి భరోసా కల్పిస్తుంది. కాంగ్రెస్ విస్మరించిన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి తెలుగువారిపై ఉన్న గౌరవాన్ని ఎన్డీయే ప్రభుత్వం చాటి చెప్పింది. వచ్చే ఐదేళ్లలో దేశంలో జమిలి ఎన్నికలకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం"అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# జగన్.. ఉత్తరాంధ్ర ద్రోహి



**అనకొండలా కొండలను మింగేశారు**
**దేవాలయాలకు రక్షణ లేకుండా పోయింది**
**ఎన్నికలు రాగానే నాటకాలు జగన్‌కు అలవాటు**
**ఈసారి గులకరాయి డ్రామా ఆడాడు**
**4వేల వృద్ధాప్య పెన్షన్ ఒకటో తేదీనే ఇస్తాం**
**ఉత్తరాంధ్ర, సుజల స్రవంతి పూర్తి చేస్తాం**
**మెగా డీఎస్సీపైనే తొలి సంతకం**
**నెల్లిమర్ల సభలో చంద్రబాబు ఘాటు విమర్శలు**

**విజయనగరం,మనసాక్షి:** జగన్ పాలనలో దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందని తెదేపా అధినేత చంద్రబాబు మండిపడ్డారు. జగన్.. ఉత్తరాంధ్ర ద్రోహిగా మిగిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం.. అధికారంలో వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో తెదేపా, జనసేన నిర్వహించిన ఉమ్మడి ప్రచార సభలో చంద్రబాబు మాట్లాడారు. రూ.4వేలు చొప్పున వృద్ధాప్య పింఛను ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే అందిస్తామని ప్రకటించారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక నాటకం ఆడటం జగన్‌కు అలవాటుగా మారిందని, ఈసారి గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. నెల్లిమర్లలో కొండలన్నీ వైకాపా అనకొండ మింగిసింది. మేం వచ్చిన వెంటనే ఉత్తరాంధ్ర, సుజల స్రవంతి పూర్తి చేస్తాం. అతిపెద్ద ఇండస్ట్రియల్ హబ్‌గా ఈ ప్రాంతం తయారవుతుంది. మా సభలకు వస్తున్న స్పందన చూసి వైకాపా నేతల్లో ఆందోళన మొదలైంది. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వైకాపా నేతలకు డిపాజిట్లు రావు. వైకాపా పాలనలో 160 దేవాలయాలపై దాడులు చేశారు. ఈ ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు ఒక్క ప్రాజెక్టు తెచ్చారా? ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేశారా? ఉత్తరాంధ్ర బాగు కోసమే భోగాపురం విమానాశ్రయం తెచ్చాం. మేం ఉంటే భోగాపురం ఎయిర్‌పోర్టు ఇప్పటికే పూర్తయ్యేదని చంద్రబాబు అన్నారు. ఒక్కచాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి.. వైఎస్ జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోయాడు. ఎంతో మంది నిరుద్యో గులు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. వైసీపీ పాలనలో వలసలు మరింత పెరిగాయి' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆరోపించారు.తాము అధికారంలోకి వస్తే వలసలు నివారిస్తామని.. ఉపాధి మార్గాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నదుల అనుసంధానం తన కల అని.. వంశధార, బ్యారేజీ తదితర ప్రాజెక్టు లను పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీని తరిమి కొట్టి.. సైకోను సాగనంపాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని బాగుచేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరును, ఆ పార్టీ నేతల అక్రమాలను తూర్పారబట్టారు. తాము అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులను, అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు చాలా నష్టపో యారు. వారిని లిక్కర్ షాపుల్లో కాపలాపెట్టారు. బదిలీలు కూడా సక్రమంగా చేపట్టలేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు

# వైఎస్‌ను తిట్టిన బొత్స పితృసమానులా

**జగన్‌కు ఉరిశిక్ష వేయాలన్న బొత్స మాటలు మరిచారా**
**ఇప్పుడు కేబినేట్‌లో ఉన్న వారంతా వ్యతిరేకులే**
**హామీలను అమలు చేయకుండా మభ్య పెట్టిన జగన్**
**రేపల్లె సభలో జగన్‌పై షర్మిల ఘాటు విమర్శలు**



**గుంటూరు:,మనసాక్షి:** వైఎస్ రాజశేఖర్ రెడ్డిని, విజయమ్మను గతంలో తిట్టిన బొత్స సత్యనారాయణ ఇప్పుడు తండ్రి సమానులని జగన్ అనడంపై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వార్త పేపర్లో చూశాక తనకు బాధ కలిగిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేపల్లె నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. ఈ సభలో జగన్ పై విమర్శలు గుప్పించారు. విజయనగరంలో నిర్వహించిన బస్సుయాత్ర సభలో జగన్ బొత్సను ఓటర్లకు పరిచయం చేస్తూ.. తన తండ్రి లాంటి వాడన్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న బొత్స సత్యనారాయణ జగన్ తో పాటు విజయమ్మ, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కూడా విమర్శించారు. తర్వాత వైసీపీలో చేరారు. ఆ మాటల్ని ఇప్పుడు గుర్తు చేసిన షర్మిల జగన్ పై విమర్శలు గుప్పించారు. ఇదే బొత్స సత్యనారాయణ రాజశేఖర్ రెడ్డిని తాగుబోతు అని తిట్టారు.. ఇదే బొత్స సత్యనారాయణ జగన్మోహన్ రెడ్డికి ఉరి శిక్ష వేయాలని కూడా అన్నారు. ఆఖరికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య విజయమ్మను కూడా బొత్స అనేక మాటలు అన్నారన్నారు.

## టిడిపి కూటమికి షాక్

**శ్రీకాకుళం: ,మనసాక్షి:** జనం అంతా జగన్ వెంటే.. మేమంతా సిద్ధం యాత్రతో ఈ విషయం మరోసారి స్పష్టమవుతోంది. ఈ క్రమంలోనే రాజకీయంగానూ అధికార పార్టీ మరింత బలపడుతోంది. కూటమికి షాకిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.తాజాగా బస్సు యాత్రలో భాగంగా బుధవారం ఉదయం ఎచ్చర్ల నియోజకవర్గం అక్కివలస నైట్ స్టే పాయింట్ వద్ద సీఎం జగన్ సమక్షంలో ప్రతిపక్షాలకు సంబంధించిన కొందరు నేతలు తమ అనుచరగణంతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. వీళ్లలో పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మాజీ జడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, అలాగే పార్వతీపురం నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నేత, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణిలు ప్రముఖంగా ఉన్నారు. పలాస నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, ఆమె కుమార్తె శిరీషలు వైఎస్సార్‌సీపీలో చేరారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం భారతీయ జనతాపార్టీకి చెందిన మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావు, ఆయన కుమారుడు పెద్దింటి రామస్వామినాయుడు జాఖీఅఖ కండువా కప్పుకున్నారు.



## ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో బాలికలదే హవా

**కంగ్టి, ఏప్రిల్ 24, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా ఇంటర్ ఫలితాల్లో కంగ్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నలుగురు బాలికలు టాపర్ గా నిలిచారని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండియర్ కు చెందిన హెచ్. జ్యోతి (బిపీసీ)- 919/1000 ,కె.దీపిక (బిపిసి )-876/1000 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్ లో బి. ప్రియదర్శిని (బిపిసి) - 366/440, బి.సువర్ణ (బిపిసి) 301/440 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కళాశాల సిబ్బంది అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 51 శాతం విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో 85 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

# కెసిఆర్ రోడ్ షో సక్సెస్





**మిర్యాలగూడ , ఏప్రిల్ 24, మన సాక్షి :**

మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన బస్సు యాత్ర తొలి రోజు బుధవారం సక్సెస్ అయ్యింది. హైదరాబాదు నుంచి మిర్యాలగూడకు బస్సుయాత్ర నిర్వహించిన కేసీఆర్ మిర్యాలగూడలో రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోకు నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. మిర్యాలగూడలోని సాగర్ రోడ్డు గులాబీ మయం అయ్యింది . రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీలు అమలు చేయని విషయంపై ఎండగట్టారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వాన్ని మెడలు వంచి పని చేపిస్తామని కోరారు. కేసీఆర్ స్పీచ్ కార్యకర్తల్లో ఉత్సాహం నిండింది. ఉద్యమ తరహాలో కెసిఆర్ స్పీచ్ ఇచ్చారు. రోడ్ షో కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు ,ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ రవీంద్ర కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్ల మోతు సిద్ధార్థ నాయకులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి , అన్న భీమోజు నాగార్జున చారి ఉన్నారు.





## బీఎంపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి నామినేషన్

**దోమ మండలం: ఏప్రిల్ 24 మన సాక్షి:**



దోమ మండలం దిరసంపల్లి తండాకు చెందిన ,పాట్లావత్ గోవింద నాయక్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా ,బహుజన ముక్తి పార్టీ తరపున నామినేషన్లు రాజేంద్రనగర్ లోని రిటర్న్ అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. బహుజన రాజ్యాధికారం రావాలంటే బహుజన ముక్తి పార్టీ ఎంపీలను గెలిపించాలని, ప్రస్తుతం నేను చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అందరూ నాకు సహకరించవలసిందిగా కోరుతున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దాస్ రామ్ నాయక్, బహుజనముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వలిగి ప్రభాకర్, బీఎంపీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పాత్లావత్ గట్ట్యా నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు, నేనావత్ హరి నాయక్, తదితరులు పాల్గొన్నారు .

## కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నామినేషన్...
# కిక్కిరిసిన కార్యకర్తలు





**కంగ్టి, ఏప్రిల్ 24, మన సాక్షి :-**

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే మదన్ మోహన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి లతో తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి అందజేశారు.జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్ నామినేషన్‌లో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాంతో సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, యేనుగు రవీందర్ రెడ్డి, నిర్మలారెడ్డి, నాగేష్ షెట్కార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

**గజ్వేల్,మర్కుక్,ఏప్రిల్,24,మనసాక్షి**



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన తలరీ సత్తమ్మ మల్లేశం కూతురు సౌందర్య (వర్ష) వివాహానికి 5,000 రూపాయలు మరియు అదే గ్రామానికి చెందిన బొమ్మ నాగమణి కొమురయ్య దంపతుల కూతురు హారిక వివాహానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్న సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉప అధ్యక్షుడు మర్కుక్ మండల్ బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను సంపాదించిన దానిలో కొంత పేదలకు సహాయం చేయడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. అన్నివేళలా పేదవారికి అండగా ఉంటానని వారి కష్ట,సుఖాలలో పాలుపంచుకుంటానని తెలియజేశారు.వారితో పాటు చెక్కల నర్సింలు,చాకలి ఇంద్రయ్య,రమేష్,యాదగిరి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కాన్వాయ్‌లో ప్రమాదం..!





**మన సాక్షి ,వేములపల్లి :**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ కాన్వాయ్ లో బుధవారం ప్రమాదం జరిగింది. ఆయన బస్సు యాత్రను హైదరాబాదులో ప్రారంభించారు. అనంతరం మిర్యాలగూడలో రోడ్ షోకు వెళ్తున్న సందర్భంగా కాన్వాయ్ లో వేములపల్లి సమీపంలో ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా కాన్వాయ్ లోని కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదు కార్లు ముందు భాగాలు ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కానీ వాహనాలు మాత్రం ధ్వంసం అయ్యాయి. దాంతో పార్టీ నాయకులు కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.

# ఘనంగా ఆంజనేయ స్వామి దేవాలయంలో గణపతి ధ్వజస్తంభ ప్రతిష్ట

## ఎమ్మెల్యే నారాయణరెడ్డిను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,ఏప్రిల్ 24 మనసాక్షి:**

ఆమనగల్లు మండల పరిధిలోని గౌరరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి గణపతి ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల ను బుధవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ పుణ్యాహవాచనము హోమం క్షీరాధివాసం పంచగ వ్యాధివాసం జలాధివాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ జాతీయ బిసి కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి,మాజీ జెడ్పిటిసి సభ్యులు కండే హరి ప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీపాతి రజిత శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముడు రోజులపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిట్టిగౌరీ భాస్కర్ రావు, వెంకట్రాములు, అంజన్ రావు,ఎంపిటిసి నిట్ట మంగమ్మ నారాయణ,చిట్టిగౌరీ శ్రీనివాస్ రావు,నిట్ట కొండల్,చిట్టిగౌరీ సీతారామా రావు,సాయి రెడ్డి, పాపిరెడ్డి,లక్ష్మణ్ రావు, పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం

**లక్షెట్టిపేట్ ఏప్రిల్ 24 (మన సాక్షి)బీ**



లక్షెట్టిపేట్ పట్టణంలోని ఉత్కూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక షెడ్డు నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు డిమాండ్ చేశారు. బుధవారం రోజున అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక షెడ్డు నిర్మించాలని లక్షెట్టిపేట మున్సిపల్ కమీషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వివిధ పనుల రీత్యా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల ఎండలో ప్రయాణాలు సాగిస్తారని, వారికి మానవత్వంతో అలోచించి షెడ్డు నిర్మించాలన్నారు. ఎండ దెబ్బ తగలకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణం నేటినేటికి పెరుగుతుందని కానీ ఇంతవరకు పర్మినెంట్ షెడ్డు నిర్మించక పోవడం శోచనీయమన్నారు. ఇంకా ఎన్టీఆర్ చౌక్ (కరీంనగర్ చౌరస్తా )లో కూడా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున ఆర్టీసీ వారు, మున్సిపల్ వారు సంయుక్తంగా తగు చర్యలు చేపడితే బాగుంటుందన్నారు. అంబేద్కరిస్టులు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. అనివార్య కారణాల వలన షెడ్డు నిర్మాణం ఆలస్యం అయిందన్నారు. 24 గంటలలోపు తమ సిబ్బందితో షెడ్డు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, తొగరు ఏసన్న, మహేష్, ప్రశాంత్, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు కోసం తిప్పలు

**కొడంగల్ ఏప్రిల్ 24 మన సాక్షి .**



కొడంగల్ నియోజకవర్గం కోస్గి మద్దూర్ కొడంగల్ బస్టాండ్ లో మహిళలు కితకితలు ఆడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి ఫ్రీ బస్సు ప్రవేశపెట్టడంతో మహిళలకు ఫ్రీ బస్సు ను సద్వినియోగం చేసుకుంటున్నారు అదేవిధంగా మద్దూరు మండలం గ్రామంలో వెలిసినటువంటి బావోజి గురుజి లోకమసం జాతరకు పెద్ద ఎత్తున గిరిజనులు నాలుగు రాష్ట్రాల నుంచి గిరిజనులు వస్తున్నారు. బస్సు సౌకర్యం ఫ్రీగా ప్రవేశపెట్టడం వల్ల మహిళలు ఆనందంతో జాతరకు వెళ్తున్నారు.

# నవ వధువు కు పుస్తె మట్టెలు అందజేసిన రమేష్ ముదిరాజ్

**గజ్వేల్,వర్గల్,ఏప్రిల్,24,మనసాక్షి**



సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో వట్టిపల్లి సుజాత కీ.శే.సురేష్ కుమార్తె నవ్య( దివ్య) వివాహానికి బుదవారం పూస్తే మట్టెలు అందజేసిన మాజీ ఉప సర్పంచ్ రమేష్ ముదిరాజ్ ఈ సందర్భంగా రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ సేవ చేయడం లో తృప్తి ఉంటుందని,ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో భారీ చేరికలు...!



**కంగ్టి ,ఏప్రిల్ 24, మన సాక్షి :-**

సంగారెడ్డి జిల్లా పెద్ద శంకరంపేట్ మండలానికి చెందిన మాజీ ఎంపిపి రామ గౌడ్ పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రహం శ్రీనివాస్ గౌడ్ తన అనుచరులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే లు సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# ఈటెల కు మద్దతుగా ఇంటింటి ప్రచారం

**నాచారం,ఏప్రిల్24,మన సాక్షి:**



మూడోసారి ప్రధాని మోడీ అవ్వడం ఖాయమని మేడ్చల్ జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ కు మద్దతుగా నాచారం డివిజన్ లో గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో గడప గడప కు ప్రచారం నిర్వహించారు. ఈటెల రాజేందర్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని స్థానికులను కోరారు. దేశ అభివృద్ధి మోడీతోనే సాధ్యమని, మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు హన్మంత్ బిరాధర్, వెంకటేష్, వినోద్ జాదవ్, వరలక్ష్మి, లావణ్య, రజియా మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు

## -నగదు సీజ్ చేసిన గౌరారం ఎస్ఐ శివకుమార్

**గజ్వేల్,వర్గల్,ఏప్రిల్,24,మనసాక్షి**



గౌరారం ఎస్ఐ శివకుమార్, సిబ్బందితో కలిసి వర్గల్ కమాన్ వద్ద ఈ ఉదయం తెల్లవారుజామున సర్ప్రైజ్ వాహనాల తనిఖీ నిర్వహించగా,మహమ్మద్ నబీ,గజ్వేల్,తన బొలోరో వాహనంలో 70,000/- ఎలాంటి ఆధారాలు లేని డబ్బులు ఉండగా సీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గౌరారం ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం లోక్ సభ ఎన్నికల సందర్భంగా సర్ప్రైజ్ వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుంది. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.పై సీజ్ చేసిన డబ్బులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీకి అప్పగించడం జరిగింది.అక్కడ డబ్బులకు సంబంధించిన ఆధారాలు చూపించుకుని డబ్బులు రిలీజ్ చేసుకోవచ్చు అని తెలిపారు.

# ఇంటర్ ఫలితాల్లో లక్షేట్టిపేట్ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

**లక్షెట్టిపేట్ ఏప్రిల్ 24 (మన సాక్షి)బీ**

బుధవారం రోజున విడుదల చేసిన తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో లక్షెట్టిపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు విజయ బావుటా ఎగరవేశారని ప్రిన్సిపల్ ఎం. లలిత కుమారి పేర్కొన్నారు.ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ గ్రూపులో జీ. మల్లేశ్వరి 986/1000, బైపీసీ గ్రూపులో కామెర రంజిత 989/1000, ఇంటర్మీడియట్ సెకండియర్ ఒకేషనల్ గ్రూప్ లో తమ్మ అలేఖ్య 994/1000, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరము ఒకేషనల్ గ్రూపులో సీ హెచ్. అక్షయ 496/500 మార్కులతో టాపర్ లుగా నిలవగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరము ఎంపీసీ గ్రూప్ లో చిట్ల అస్మిత 467/470, బైపిసి గ్రూపులో కోరం అక్షిత 437/440 మార్కులతో కళాశాల టాపర్లుగా నిలిచారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. మహేశ్వర రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ జి మౌనిక,అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీ



**శంకర్‌పల్లి: ఏప్రిల్ 24: (మన సాక్షి):**

శంకర్‌పల్లి మండలం శేరిగూడెం గ్రామంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి సెక్రెటరీ ఉదయ్ మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు ప్రకాష్, మాజీ ఎంపిటిసి ఎజాస్, మండల ఉపాధ్యక్షులు నసిరుద్దీన్, ఐఎన్ టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, గ్రామ అధ్యక్షులు మైలారం శ్రీనివాస్, తిరుపతి, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు తౌఫిక్, శ్రీనాథ్ గౌడ్, చంద్రమౌళి, లావణ్య శ్రీనివాస్ రెడ్డి, సంధ్యారాణి అశోక్ కుమార్, నాయకులు అందూరి పెంటయ్య, మోహన్ రెడ్డి, ఖయ్యూం, శ్రీకాంత్ ముదిరాజ్, బద్దం కృష్ణారెడ్డి, శ్రీశైలం, రామచందర్, మాజీ సర్పంచ్ శ్రీధర్, సుధాకర్ రెడ్డి, మహబూబ్ హుస్సేన్, మల్లికార్జున్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, భూషణ్ గౌడ్, అస్లాం, భూషణ్, శివలింగం, సంజయ్, రాకేష్ కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి సుశీల పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డకు పుస్తే మెట్టెలు అందజేసిన ఎంపీపీ పాండు గౌడ్



**గజ్వేల్,మర్కుక్,ఏప్రిల్,24,మనసాక్షి**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన ఆడపడుచు తలారి సత్తమ్మ మల్లయ్యల కూతురు సౌందర్య వివాహానికి మర్కుక్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ )పాండు గౌడ్ పుస్తె మెట్టెలు అందించి మరోసారి ఉదారత్వం చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము సంపాదించిన రూపాయి కష్టార్జితం నుండి కన్న ఊరికి సాయంగా ఆపతి సంపదలో ఊరికి నావంతు నేను కూడా భాగస్వామ్యం కావడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు.వారి సేవాగుణం చూసి అక్కడ ఉన్న బంధువులు ఈ ఊర్లో మంచి సంస్కృతి ఉందని ప్రత్యక్ష్యంగా అభినందనలు తెలిపారు.వారితో పాటుగా మాజీ యూత్ మండల అధ్యక్షులు కర్ణాకర్,చెక్కలి రాములు,తాజా మాజీ వార్డు సభ్యులు గణేష్,చాకలి నర్సింలు,కృష్ణ,రమేష్ లతో కలసి అందించారు.

# అమిత్ షా మీటింగ్ విజయవంతం చేయాలి

## -మర్కుక్ మండల బిజెపి అధ్యక్షుడు సాయి రెడ్డి రాంరెడ్డి

**గజ్వేల్,మర్కుక్,ఏప్రిల్,24,మనసాక్షి**



సిద్దిపేట జిల్లాలో గురువారం నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్ కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా వస్తున్నందున, మర్కూక్ మండల కేంద్రము లో గల అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు మరియు శక్తి కేంద్ర ఇన్చార్జులకి ప్రత్యేకంగా ఉదయం మీటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.కార్యకర్తలకు భూత్ ఇంచార్జ్ లకు దిశ నిర్దేశం మరియు పార్టీ అంతర్గత ముఖ్యాంశాల గురించి చర్చా జరుపబడును కాబట్టి తప్పకుండా అందరూ హాజరు కవలసిందిగా కోరారు. గురువారం ఉదయం 10:30 నిమిషాలకు మర్కుక్ మండల కేంద్రానికి రాగలరని మర్కుక్ మండల బిజెపి అధ్యక్షుడు సాయి రెడ్డి రాంరెడ్డి తెలియజేశారు.సిద్దిపేటలో నిర్వహించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు ప్రతి కార్యకర్త తరలిరావాలని మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు గెలుపే లక్ష్యంగా సభను విజయవంతం చేయగలరని కోరారు.

# ములుగు గురుకుల కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులు

**గజ్వేల్,ములుగు,ఏప్రిల్,24,మనసాక్షి**

తెలంగాణ రాష్ట్రంలో నేడు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు.రాష్ట్రంలో మొదటి సంవత్సరంలో 60.01 శాతం,ద్వితీయ సంవత్సరంలో 64.61 శాతం ఉత్తీర్ణులు కాగా ఈ ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు.కాగా సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలో గురుకుల ఇంటర్మీడియట్ కళాశాల లో ఎంపీసీ సెకండ్ ఇయర్ లో 37 విద్యార్థులకు36 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.బైపీసీ సెకండ్ ఇయర్ లో 100 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు, ఎంపీసీ ఫస్ట్ ఇయర్ లో 96.74 శాతం ఉత్తీర్ణులు కాగా,బైపిసి ఫస్ట్ ఇయర్ లో 100% ఉత్తీర్ణులు అయినందుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి కల్పన సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కల్పన విద్యార్థులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో చదివి మంచి మార్కులతో ములుగు గురుకుల కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు.అలాగే ఇకపై ఉన్నత చదువులు చదివి కళాశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులతో అన్నారు.ఎంపీసీ సెకండ్ ఇయర్ టాపర్స్ గా వి. లావణ్య 986 /1000,బి. మనీషా 975 /1000,హిమబిందు 966/1000,పి.అమృత 964/1000,బుస్స శ్రీనిధి 959/1000, ఉత్తీర్ణత సాధించారు.మరియు బైపిసి సెకండియర్ టాపర్స్ గా జి రమ్యశ్రీ 970/1000,జి. ఉమాదేవి 970/1000,ఎస్. రేష్మ 962/1000,జి.దీప్తిషైనీ 962/1000,బి.మహాలక్ష్మి 948/1000,ఉత్తీర్ణత సాధించారు.ఇకఎంపీసీ ఫస్టియర్ టాపర్స్ గా సిహెచ్ అమూల్య 465/470,డి.తేజశ్రీ 463/470,డి.ప్రేరిత 463/470,ప్రనితాశ్రీ 461/470,యు.నంధిని 459/470,ఎన్.అక్షయ 459/470,ఎస్ ప్రహర్షిత 459/470,ఉత్తీర్ణత సాధించారు.బైపిసి ఫస్టియర్ టాపర్స్ గా ఎం.మౌనియాశ్రీ 431/440,ఆర్.రాణి 430/440,పి.అమృత 429/440,ఆర్.నవోదయ 428/440,సిహెచ్ కీర్తన 424/440,శృతి 424/440, జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.రేపటినుంచి వచ్చే నెల 5 వరకు రీవ్యాల్యుయేషన్, రీవెరిఫికేషన్ కు దరఖాస్తుకు గడువు ఉందని మిగతా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# లక్షేట్టిపేట్ అమ్మాయికి స్టేట్ ర్యాంక్

**లక్షెట్టిపేట్ ఏప్రిల్ 24 (మన సాక్షి)బీ**



తెలంగాణ ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు విడుదలయ్యాయి. ఫలితాల్లో అ?మ్మాయిలదే హవా కొనసాగగా స్టేట్ టాపర్‌గా కూడా అమ్మాయిలు రావడం విశేషం. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో లక్షెట్టిపేట్ పట్టణానికి చెందిన తోట భాస్కర్-రాధల పెద్ద కుమార్తె వైష్ణవి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని ఇంటర్ మొదటి ఏడాదిలో 470 మార్కులకు గాను ఏకంగా 467 మార్కులు సాధించింది. ఎంపీసీ గ్రూప్ తీసుకున్న వైష్ణవి పరీక్షల్లో 467 మార్కులు సాధించింది. ఇంగ్లీష్- 98, సంస్కృతం- 99, మ్యాథ్స్ 1ఏ- 75, మ్యాథ్స్ 1బీ- 75, ఫిజిక్స్- 60, కెమిస్ట్రీ- 60 మార్కులు సాధించింది. వైష్ణవి పై ప్రశంసలు కురిపిస్తున్నా కుటుంబ సభ్యులు, లక్షెట్టిపేట్ పట్టణ వాసులు.

# ఇద్దరు నిందితులను అరెస్టు

## గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి జగదేవపూర్ పోలీస్ స్టేషన్



**గజ్వేల్,జగదేవపూర్,ఏప్రిల్,24,మనసాక్షి**

కేసు యొక్క వివరాలు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్రెడ్డి తెలియపరుస్తూ తేది ఏప్రిల్ 21 సాయంత్రం 5:30 గంటలకు స్థానిక రామ్ రెడ్డి చికెన్ షాప్ లో పనిచేసే పశ్చిమబెంగాల్ రాష్ట్రాని కి చెందిన వర్కర్లు కుర్బాన్ అలీ మొల్ల,రూబల్ (ఇద్దరు మేజర్లు) చికెన్ షాప్ కౌంటర్ లో ఉన్న డబ్బును సొంతం చేసుకోవాలి అనే దురుద్దేశ్యంతో యజమాని అయిన బుచ్చిరెడ్డి మహిపాల్ రెడ్డి ని షాప్ వెనుక గదిలోకి పిచిలి గొంతు పిసికి హత్య చేసి కౌంటర్ లోని డబ్బుని తీసికొని పారిపోయినారు. ఇట్టి హత్య పైన మృతుని సోదరుడు బుచ్చిరెడ్డి శ్రీపాల్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా,జగదేవపూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తును గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.మహేందర్ రెడ్డి కి అప్పగించారు.అదే రోజు నిందితులు అటో లో ప్రజ్ఞాపూర్ కి వెళ్లి అక్కడ నుండి ఆర్టిసి బస్సు లో సికింద్రాబాద్ కు చేరుకొని అక్కడ హౌరా వెళ్ళు ఈస్ట్ కోస్ట్ ఎక్స్ప్రెస్ ట్రైన్ లో ఎక్కి పారిపోతుండగా,సిపి సిద్ధిపేట ఆదేశానుసారం జగదేవపూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ మరియు సిబ్బంది ఒక టీమ్ గా ఏర్పడి అధునాతన సంకేతికను ఉపయోగించి ట్రైన్ లో పారిపోతున్న నిందితులను గుర్తించి రైల్వే పోలీసులకు సిసి పుటేజి లోని నిందితుల ఫోటోలను పంపగా,వారు నిందితులను మంగళవారం ఉదయం 10:30 గంటలకు విశాఖపట్టణం (వైజాగ్) రైల్వే స్టేషన్ లో పట్టుకున్నారు. విశాఖపట్టణం రైల్వే పోలీసులు నిందుతులను జగదేవపూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్,సిబ్బంది నాగరాజు,రాకేశ్,సురేష్, పర్శరాములు కు అప్పగించినారు.మంగళవారం రాత్రి 10:00 గంటలకు దర్యాప్తు అధికారి అయిన గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.మహేందర్ రెడ్డి ముందు సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ నిందితులను హాజరు పరచగా,నిందితులు పని సరిగ్గా చేయనందున మహిపాల్ రెడ్డి మందలించగా దానిని మనస్సులో పెట్టుకుని మరియు కౌంటర్ లో ఉన్న డబ్బును సొంతం చేసుకోవాలి అనే దురుద్దేశ్యంతో మహిపాల్ రెడ్డి ని హత్య చేసినట్టు విచారణలో ఒప్పుకున్నారు. అదేవిధంగా వారి వద్ద నుండి సెల్ ఫోన్లను,నగదును సీజ్ చేయడం జరిగింది.విచారణ అనంతరం తేది ఏప్రిల్ 24 న నిందితులు కుర్బాన్ అలీ మొల్ల,రూబల్,లను రిమాండ్ కు పంపడం జరిగింది.ఈ సందర్భంగా
కేసు చేదించడంలో కీలకపాత్ర వహించిన జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్, ఇన్స్పెక్టర్ పి.మహేందర్ రెడ్డి, మరియు పోలీస్ సిబ్బంది ని గజ్వేల్ ఏసిపి ఎ.పురషోత్తం రెడ్డి అభినందించడం జరిగిందని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# నాలుగు నెలల్లోనే... ఐదు గ్యారెంటీలు అమలు చేశాం...

**అందోలు, ఏప్రిల్ 24, మనసాక్షి :**

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నాలుగు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. బుధవారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశనం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ను గెలిపించాలని మంత్రి కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకీ వచ్చి నాలుగు నెలలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలలో 5 గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి,సీఎం రేవంత్ రెడ్డి కి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. తొమ్మిదిన్నర ఏండ్లు అధికారంలో ఉండి దోపిడీ,దగా,అబద్ధాలు, కుటుంబ పాలన సాగించిన తెలంగాణ భరించి, కాంగ్రెస్ చరిత్రను గుర్తించి గౌరవించి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరల కాలంలో ఎన్నికల హామీలను హామీలను నెరవేర్చలేదు కానీ, ప్రతిపక్షంగా ఉండి నాలుగు నెలలు ఓపిక లేకుండా అధికార పార్టీపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ కార్యకర్త కాలర్ ఎగరవేసుకొని ప్రజాక్షేత్రంలో ముందుకు పోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. బి బి పాటిల్ బిఆర్ఎస్ పార్టీలో పదేళ్లు ఎంపీగా ఉండి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా ఇప్పుడు బిజెపి పార్టీ కండువా కప్పుకొని వచ్చారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలకు పైగా భర్తీ చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో సహకరించుకొని పార్లమెంట్ ఎన్నికల తో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా , ఎంపీటీసీలుగా , జడ్పీటిసిలుగా ,జడ్పీ చైర్మన్లు గా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అఖండ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం , జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయడానికి పార్టీ కార్యాలయం నుండి వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ , శాసనసభ్యులు మదన్ మోహన్ రావు, సంజీవరెడ్డి, తోట లక్ష్మీ కాంతారావు, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ రెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి చంద్రశేఖర్, జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, వేలాదిమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంత్రి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



- తొమ్మిదిన్నర ఏళ్ళు దోపిడీ, దగా, అబద్ధాలతో బిఆర్ఎస్ పాలన సాగించింది..
- కాంగ్రెస్ చరిత్రను గుర్తించి గౌరవించి తెలంగాణ ప్రజలు అధికారం ఇచ్చారు...
- అధికారం కోల్పోయిన బాధలో ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు నాలుగు నెలలు ఓపిక పట్టడం లేదు...
- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమాన్ని ఇవ్వబోతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం...
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- సురేష్ షెట్కార్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి...

## బీజేపీ విజయాన్ని కాంక్షిస్తూ మెట్ల మార్గంలో ఏడుకొండల స్వామిని దర్శించుకున్న నేతలు.

**కూకట్ పల్లి, ఏప్రిల్ 24(మన సాక్షి ):**



చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డితోపాటు వారణాసిలో ప్రధాని నరేంద్రమోడీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఒబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆద్వర్యంలో బిజెపి నాయకులు దీపక్, శివకుమార్, సిహెచ్ రాజు ప్రభృతులు కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని మెట్ల మార్గం ద్వారా నడుచుకుంటూ వెళ్లి దర్శించుకున్నారు. ప్రజా సేవకులైన కొండ విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో ఎంపీగా విజయాన్ని అందుకోవడంతోపాటు నరేంద్రమోడీ మూడోసారి ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్టించాలని ఏడుకొండల స్వామిని కోరుకున్నట్లు ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ తెలిపారు. మోడీతోనే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోనే దేశంలో ప్రగతి, సుస్థిరమైన పాలన సాధ్యమవుతుందని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

## 467 మార్కులతో ఇంటర్ లో సత్తా చాటిన విద్యార్థి అభిలాష్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,ఏప్రిల్ 24 మనసాక్షి:**



కొట్ర గ్రామానికి చెందిన తిర్మన్ దాస్ అభిలాష్ గౌడ్ అనే విద్యార్థి ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో తన సత్తా చాటాడు ఎంపీసీలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి తన ప్రతిభను చూపాడు.అభిలాష్ గౌడ్ కల్వకుర్తిలోని వీబీస్ హైస్కూల్లో పదవ తరగతి వరకు చదివాడు.ఇంటర్ రావిర్యాల నారాయణ కాలేజీ లో చదువుతున్న అభిలాష్ గౌడ్ స్టేట్ టాపర్ ర్యాంక్ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు చంద్రకళ నాగరాజు గౌడ్, పలువురు నాయకులు, గ్రామస్తులు అభిలాష్ గౌడును అభినందించారు. చదువులో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

## సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్ళాలి సీఐ కృష్ణ మోహన్.

**కూకట్ పల్లి, ఏప్రిల్ 24(మన సాక్షి ):**

కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని 22 మోటర్ సైకిల్స్ ను పోలీస్ స్టేషన్ ఆవరణలో గత కొంత కాలంగా ఉన్నాయని కూకట్ పల్లి సిఐ కృష్ణమోహన్ వెల్లడించారు. ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు సరైన ధ్రువపత్రాలతో స్టేషన్ లోని సంబంధిత అధికారులను కలిసి వాటిని చూపిస్తే వాహనాలను వారికి అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ వాహనాలకు సంబంధించి వారి యజమానులకు రిజిస్టర్ పోస్టు ద్వారా రెండు సార్లు నోటీసులు పంపించడం జరిగిందని వారు సరైన సమయంలో వచ్చి వారి వాహనాలను తీసుకొని వెళ్లాలని సూచించారు. లేదంటే చట్ట ప్రకారం ఆ వాహనాలను వేలం వేస్తామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

## రాష్ట్ర సరిహద్దులో వాహనాల తనిఖీలు

**కంగ్టి, ఏప్రిల్ 24, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని దెగుల్ వాడి రాష్ట్ర సరిహద్దు వద్ద బుధవారం అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున, పక్కనే ఉన్న కర్ణాటక నుండి మద్యం, డబ్బు అక్రమ రవాణా కాకుండా పకడ్బందిగా చర్యలు తీసుకుంటున్నామని తనిఖీ టీం అధికారి విజయ్ కుమారి తెలిపారు. రూ.50 వేలు కంటే అధికంగా డబ్బు ఉండి పక్కా ఆధారాలు లేకపోతే మాత్రం సీజ్ చేస్తామన్నారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ డేవిడ్ ఉన్నారు.

## సాటి మనిషికి సహాయం చేయడమే భగవంతుని సేవ..

**కురవి ఏప్రిల్ 24 మన సాక్షి:**



సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్సాటి మనిషి కి సహాయం చేయడమే భగవంతుని అన్నింటికన్నా ఇష్టమైన సేవ అని, సహాయం కావలసిన వారిని గుర్తించి సహకరించాలని సత్యసాయిసేవాసమితి కురవి మండలకన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో శ్రీసత్య సాయిసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన ఉత్సవాల్లో భాగంగా నారాయణసేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కురవిలోని శ్రీవీరభద్రస్వామివారి దేవాలయం వద్ద సుమారు 150 మందికి పులిహోర, పండ్లు,మజ్జిగప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని, సత్యసాయి బోధించిన పవిత్రమార్గం అదేనని తెలిపారు. శ్రీసత్యసాయిసేవాసమితి కురవిశాఖ ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వాములు కావాలని కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి తిరుమలరావు, లక్ష్మి, యశ్వంత్, కర్నాటి మోహన్ రావు, నాగమణి, సరిత, నవ్య, స్వరూప,మల్లేశ్వరి, మంజుల, రమాదేవి,లలిత, సాయి, వేమిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## పార్లమెంట్ సీటు స్థానికులకు కేటాయించాలి డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ కు వినతి.

**నేలకొండపల్లి, ఏప్రిల్ 24 మన సాక్షి:**



ఖమ్మం పార్లమెంట్ సీటు ను స్థానికులకు కేటాయించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్ లకు స్థానిక నాయకులు వినతి ప్రతం అందించారు. బుధవారం నేలకొండపల్లి పర్యటన కు వచ్చిన సందర్భంగా మండల కేంద్రంలో వినతి పత్రం అందించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కట్టెకోల సుధాకర్, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, నాగేంద్రబాబు, ధనమూర్తి, కడియాల నరేష్, జెర్రిపోతుల అంజిని, రెడ్డిమళ్ల బాబురెడ్డి, పగిడికత్తుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు.

**కురవి , ఏప్రిల్ 24 మన సాక్షి :**



కురవి మండలం రాజోలు గ్రామంలో 70 కుటుంబాలు బి ఆర్ ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరారు.. ఈ రోజు రాజోలు లో గ్రామ పార్టీ అధ్యక్షుడు బండెల సంజీవ రెడ్డి నివాసంలో జరిగిన చేరికలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యుడు డా. రాం చంద్ర నాయక్, ఎంపీ అభ్యర్థి పొరిక బలరాం నాయక్ హాజరయ్యారు.. వారి సమక్షంలో గ్రామ ఉప సర్పంచ్ అంబటి అనుష విష్ణు వర్ధన్, వార్డు సభ్యులు అత్తునూరి నాగన్న , బొడ్డు ఉపేందర్, రాగం భద్రయ్య, ముదిరాజ్ సొసైటి అధ్యక్షుడు బసన బోయిన వెంకన్న, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బస్వ కొమరయ్య, బస్వా అబ్బయ్య, బండేల వెంకట్ రెడ్డి, మక్కల ఎల్లయ్య, తటిపాముల మధుసూదన్, పోగుల రమేష్, రడం శ్రీను, మేకల గంగాధర్, షేక్ కరీం ఎద్దు బాలయ్య, పోగుల రామ్మూర్తి, గడ్డం వెంకట నర్సు, గాలి జోసెఫ్, గడ్డం అప్పయ్య, యాట పుల్లయ్య , ఇడీగపల్లి కనకయ్య, లతో పాటు 70 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు...ఈ కార్యక్రమంలో టిపిసిసి కో ఆర్డినేటర్ బండి శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రమ్, జిల్లా నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బదా వత్ రాము నాయక్, కాలం రవీందర్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్, బాణోత్ తుకారాం నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్ల పల్లి రజనీ కాంత్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు ఇస్లవత్ సుధాకర్, గ్రామ సీనియర్ నాయకులు కురుమ దామోదర్, మరగని వీరభద్రమ్, కొకూ శ్రీను, కేదాసు ప్రసాద్, సురం మల్లారెడ్డి, అంబటి గోవర్దన్, గుంటుక వెంకటేష్, బాసన బోయిన శ్రీధర్, ఏడేల్లి బిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొక్కు వెంకటేష్, దయాకర్, గుండ హరీష్,రాయల నరేష్ పాల్గొన్నారు..

# మదనపల్లెలో జన సునామి

## వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ కు పోటెత్తిన జనం

మదనపల్లె, ఏప్రిల్ 24, మన సాక్షి:

మదనపల్లెలో బుధవారం జన సునామి కనబడింది. ఉదయం 9 గంటలకే రోడ్లన్నీ జనాలతో క్రిక్కిరిసి పోయాయి. నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ నామినేషన్ కార్యక్రమానికి వేలాది మంది జనం హాజరయ్యారు. బుధవారం ఎంతో అట్టహాసంగా నామినేషన్ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లి రూరల్ మండలం, మదనపల్లి పట్టణము నుండి భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బెంగళూరు బస్టాండ్ కి చేరుకున్నారు. ఇక్కడి నుండి భారీ ర్యాలీ మీదుగా సుమారు గంటపాటు చిత్తూరు బస్టాండ్ కు చేరుకున్నారు. దారి పొడువున జయహో సీఎం జగన్మోహన్ రెడ్డి, జిందాబాద్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, నిసార్ అహ్మద్ అంటూ నినాదాలు చేశారు. బళ్లారి డ్రమ్స్, కొమ్ము వాయిద్యం, బంజారుల నృత్య ప్రదర్శనలతో ఈ ర్యాలీ సాగింది. దారి మధ్యలో మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజ రెడ్డి, ఏపీ ఎండీసీ రాష్ట్ర చైర్ పర్సన్ షమీం అస్లాం, వైసీపీ మైనార్టీ నాయకులు ముబషర్ అహ్మద్ మాట్లాడారు. ఒక పిలుపుతో నామినేషన్ కార్యక్రమానికి మదనపల్లి నియోజకవర్గం నుండి వేలాదిమంది జనం హాజరయ్యారంటే కేవలం



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పైన ఉన్న అభిమానిమేనని తెలిపారు. విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ నామినేషన్ వేసేందుకు దేశాయ్ తిప్పారెడ్డి, షమీం అస్లాం, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి, జడ్పిటిసి ఉదయ్ కుమార్, సీనియర్ నాయకులు బండపల్లి అక్కులప్ప మద్దతుగా సబ్ కలెక్టర్ కార్యాలయం కు వెళ్లారు. అక్కడ ఆర్డిఓ హరిప్రసాద్ కు నిసార్ అహ్మద్ నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అన్ని మండలాల సర్పంచ్ లు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మట్టిలో మాణిక్యం గుండు వెంకటేష్

నడిగూడెం,ఏప్రిల్ 24, మన సాక్షి :



ఇంటర్ ఫలితాలలో నడిగూడెం మండలం రత్నవర గ్రామానికి చెందిన గుండు సీతారాములు కుమారుడు గుండు వెంకటేష్ ఫస్ట్ ఇయర్లో 470 మార్కులకి గాను 460 మార్కులు సాధించాడు.మొదటి స్థానం సాధించాడు ఇతను జి న్ సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువుకొని ఎంతో కష్టపడి కష్టాలను కూడా ఎదిరించి 470/460 సాధించడం అనేది చాలా గొప్పగా ఈ విషయాన్ని అందరూ కూడా మెచ్చుకొని వెంకటేష్ కి గ్రామస్తులు చాలా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు

రామసముద్రం,ఏప్రిల్ 24,మన సాక్షి:



మండల పరిషత్ కార్యాలయం నందు జరిగిన బుధవారం జాతీయ పంచాయత్ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి యొక్క సమన్వయం తోఘనంగా కేక్ కట్ చేసి.మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారు జాతీయ పంచాయతి రాజ్ దినోత్సవ ప్రాముఖ్యత ను వివరించి కార్యలయ సిబ్బందికి జాతీయ పంచాయత్ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి సిబ్బందికి ప్రముకులకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమములో ఎంపిడిఓ నారాయణ స్వామి, పరిపాలన అధికారి బి. రమణ సీనియర్ సహాయకులు జె. శ్రీనివాసులు.జూనియర్ సహాయకులు యం. రమాదేవి,టి. వి. శాంతి.గోవర్ధనరాజు పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ లో జిల్లా టాపర్ గా శ్రీవాణి

శాలిగౌరారం,ఏప్రిల్ 24,మనసాక్షి:



నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన పేద విద్యార్థిని దేవరకొండ శ్రీవాణి ఇంటర్ సెంకడ్ ఇయర్ లో ఎంపీసీ విభాగం లో 992 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచింది..శాలిగౌరారం మండల కేంద్రానికి దేవరకొండ దేవేంద్రచారి -చంద్రకళ దంపతుల రెండవ కుమార్తె అయిన శ్రీవాణి 1 వ తరగతి నుంచి 5 వరకు శాలిగౌరారం లోని విజ్ఞాన జ్యోతి స్కూల్ లో,6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు వల్లాల మోడల్ స్కూల్ లో ఇంటర్ నల్గొండ లోని గీతాంజలి జూనియర్ కళాశాల లో చదివింది. తండ్రి దేవేంద్రచారి 7 ఏళ్ల క్రితం అనారోగ్యం తో చనిపోయిన మొక్కవోని ధైర్యం తో పేదరికాన్ని జయించి కష్టపడి చదివి ఇంటర్ లో జిల్లా టాపర్ గా నిలించింది. ఈ సందర్భంగా శ్రీవాణి ని పలువురు అభినందించారు. శ్రీవాణి మాట్లాడుతూ నల్గొండ లోని గీతాంజలి కళాశాల యాజమాన్యం వారు చక్కని విద్యను అందించారని,తాను భవిష్యత్తు లో సివిల్స్ సాధించడమే లక్ష్యమన్నారు.

## వేముల రామిరెడ్డి ఆశయాలను సాధించాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 24, మన సాక్షి:




మాజీ కౌన్సిలర్ సిపిఎం పట్టణ నాయకులు వేముల రాంరెడ్డి ఆశయాలను సాధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో వేముల రామ్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. అంతకముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి యువజన నాయకుడిగా అనేక పోరాటాలు చేశారని పేద ప్రజల సంక్షేమం కోసం ఉద్యమాలు జరిపారని తెలిపారు. హౌసింగ్ బోర్డ్ కౌన్సిలర్గా అనేక సేవలు అందించారని అనారోగ్య కారణాలు రీత్యా ఆయన చనిపోవడం బాధాకరమన్నారు. నిత్యం పేద ప్రజల కోసం పరితపించేవారని ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో పాలుపంచుకున్నారని, ఎన్ని ఆటుపోటులు ఎదురైనా ఎర్రజెండాను వదిలిపెట్టలేదని గుర్తు చేశారు. ఓట్లు సీట్లు కమ్యూనిస్టు పార్టీలకు ప్రమాణికం కాదని పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బిజెపి పార్టీని ఓడించాలని కోరారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి అధ్యక్షుతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్ భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగా రెడ్డి, వరలక్ష్మి, పరుశు రాములు, తిరుపతి రామ్మూర్తి, వినోద్ నాయక్, సీనియర్ నాయకులు గాదె పద్మ, రొంది శ్రీనివాస్, గోవర్ధనమ్మ, పాపా నాయక్, రాంచంద్రు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి అలేఖ్య కు ఎస్ఎఫ్ఎస్ అభినందన

నేలకొండపల్లి, ఏప్రిల్ 24 మన సాక్షి:




యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (యూపీఎస్సీ)లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఎస్ఎఫ్ఎస్ పూర్వ విద్యార్థి రావూరి అలేఖ్య కు యాజమాన్యం అభినందనలు తెలిపారు. మండలం లోని కొత్తకొత్తూరు సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ '(ఎస్ఎఫ్ఎస్) లో బుధవారం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. 2001-2002 లో అలేఖ్య ప్రాధమిక విద్య అభ్యసించినట్లు యాజమాన్యం ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిల్కీ జోసెఫ్ మాట్లాడారు... అలేఖ్య ప్రాధమిక విద్య తమ స్కూల్ చదవటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మొదటి నుంచి చదువులో ప్రతిభ కనపరిచే విద్యార్థిని అన్నారు. ప్రతీ విద్యార్థి అలేఖ్య ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలకు. తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల -ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 24, మన సాక్షి:

ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఆళ్ళ రామ శేషయ్య జన్మదిన సందర్భంగా మిర్యాలగూడ అన్నపూర్ణ నేత్రాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆళ్ళ రామ శేషయ్య రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఇప్పటివరకు 70000 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్ నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. శిబిరంలో 150 మందికి పైగా రోజులకు ఉచితంగా వచ్చే పరీక్షలు చేసి మందులు దుస్తులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హనుమంత రావు,రోగులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లి బి ఫాంపై వీడిన సస్పెన్స్..!!



## జయచంద్రారెడ్డికే అవకాశం

మదనపల్లి, ఏప్రిల్ 24, మన సాక్షి :

ఎట్టకేలకు అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి జయ చంద్రారెడ్డికి బీఫామ్ అందుకున్నారు. తంబళ్లపల్లి తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరపల్లి జయచంద్రా రెడ్డితోపాటు తంబళ్లపల్లి టిడిపి ఎన్నికల సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు ఈ సందర్భంగా పాల్గొన్నారు.

## ఘనంగా సిద్దేశ్వర స్వామి శిఖరోత్సవం



కంగ్టి, ఏప్రిల్ 24, మన సాక్షి :-

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో సిద్దేశ్వర జాతర ఉత్సవాల్లో మొదటి రోజు శిఖరోత్సవ కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. అంత ముందు స్థానిక సిద్దేశ్వర మఠంలో శిఖరానికి గామస్తులు సాంప్రదాయ పద్ధతిన పూజలు నిర్వహించారు. అనంతరం వితలేశ్వర మందిరం వరకు ఊరేగించారు. అక్కడినుండి స్థానిక నేతాజీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన రథం వద్దకు శిఖరాన్ని తెచ్చి రథంపై అధిరోహించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు మిట్స్ కళాశాలకు సినీ హీరో నిఖిల్ రాక

మదనపల్లి,ఏప్రిల్ 24, మన సాక్షి :



మదనపల్లి దగ్గర అంగళ్ళు లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ %ఽ% సైన్స్ (మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల)లో గురు, శుక్రవారాల్లో జాతీయ స్థాయిలో టెక్నో - కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ 2%ఎ%24 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఈ అశ్వ కార్యక్రమానికి సినీతారలు, సింగర్లు వస్తున్నట్లు తెలిపారు. గురువారం కార్తికేయ సినిమా హీరో నిఖిల్ తో పాటు ప్రముఖ మిమిక్రి ఆర్టిస్ట్ ఆర్ జె సూర్య, 26న ప్రముఖ గాయకులు అర్జున్ విజయ్, సిందూజా శ్రీనివాసన్ మరియు ఎం. పర్ణిక లు రాబోతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను అలరించడానికి ఈ కార్యక్రమములను కళాశాల క్యాంపస్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమం లో పాల్గొనవచ్చని తెలిపారు.

## సత్తా చాటిన పాలవరం విద్యార్థి

అనంతగిరి,ఏప్రిల్ 24,మన సాక్షి:



ఇంటర్మీడియట్ ప్రకటించిన పరీక్షా ఫలితాలలో మొదటి సంవత్సరం చదువుతున్న అనంతగిరి మండలం పాలవరం గ్రామానికి చెందిన మట్టపల్లి సురేష్ ఎంపీసీ విభాగం నందు సత్తా చాటి రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించారు. హైదరాబాదులోని చైతన్య కళాశాలలో చదువుతున్న సురేష్ రాష్ట్రంలో 470 మార్కులకు 465 సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు మట్టపల్లి ఉపేందర్ ధనలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన సురేష్ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత విద్యను ప్రసించి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

## 108 ఉద్యోగులకు ముగిసిన శిక్షణా



నకిరేకల్,ఏప్రిల్ 24,మనసాక్షి:

అత్యవసర అంబులెన్స్ లలో (108) సేవలు అందిస్తున్నటువంటి ఉద్యోగులకు ( ఈఎంటి. పైలెట్లకు గత ఆరు రోజులుగా (17 నుంచి 23 వరకు) స్థానిక నకిరేకల్ లో జోన్ లెవల్ (నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట, జనగామ) శిక్షణా తరగతులు నిర్వహించి సర్టిఫికేట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ షేక్ నసీరుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక ఉద్యోగి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తమ యొక్క నైపుణ్యతను మెరుగు పర్చుకొంటూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వాతావరణం లోని మార్పులకు అనుగుణంగా ఎండాకాలం లో వచ్చే వడదెబ్బ బాధితులకు చేయవలసిన చికిత్స పై ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ఇంకా మెరుగైన సేవలను ఎలా అందించాలో ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన సేవలను ఎలా అందిచాలో ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్పించారు. పైలట్ ( డ్రైవర్) లకు అంబులెన్స్ లను నడపడంలో మెళుకువలు నేర్పించారు.ఈ శిక్షణా తరగతులలో ట్రైనర్ గజెందర్ ప్రమోద్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ షేక్ నసీరుద్దీన్ నల్గొండ జిల్లా మేనేజర్ అబ్దుల్ రహీం సూర్యాపేట జిల్లా మేనేజర్ సోమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో బాలికలదే హవా

కంగ్టి, ఏప్రిల్ 24, మన సాక్షి :-

సంగారెడ్డి జిల్లా ఇంటర్ ఫలితాల్లో కంగ్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నలుగురు బాలికలు టాపర్ గా నిలిచారని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండియర్ కు చెందిన హెచ్. జ్యోతి (బిపీసీ)-919/1000, కె.దీపిక (బిపిసి )-876/1000 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్ లో బి. ప్రియదర్శిని (బిపిసి) -366/440, బి.సువర్ణ (బిపిసి) 301/440 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కళాశాల సిబ్బంది అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 51 శాతం విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో 85 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

## బూర నర్సయ్య గౌడ్ గెలుపు ఖాయం

**ఆర్వపల్లి,ఏప్రిల్ 24,మన సాక్షి:**



భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూ ర నర్సయ్య గౌడ్ గెలుపు ఖాయమని భారతీయ జనతా పార్టీ యువమోర్చా అధ్యక్షుడు నల్లగుంట్ల నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బిజెపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ జె ఏ సి తరపున ముందుండి పోరాటం చేసిన ఉద్యమ నేత అన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ కు నిధులు మంజూరు చేయించిన ఘనత బూర నర్సయ్య అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన బీసీ బిడ్డగా ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్ జిన్న అశ్విన్ ముదిరాజ్, చవ్వ సురేష్ కుర శంకర్ ముదిరాజ్, బుర్ర జనార్ధన్, కీర్తి వెంకటేశ్వర్లు, బి రమేష్, లింగంపల్లి వెంకటయ్య, పగడాల బిక్షం రెడ్డి, శతకోటి వెంకన్న, వేముల సత్తయ్య, రమేష్, భైరబోయిన నాగయ్య, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎర్ర జెండా వేగుచుక్క కామ్రేడ్ గండు అంతయ్య

**నడిగూడెం,ఏప్రిల్ 24,మన సాక్షి:**



బృందావనపురం గ్రామానికి చెందిన కామ్రేడ్ గండు అంతయ్య(80) అనారోగ్యంతో మృతి చెందారు వారి పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్య నారాయణ మాట్లాడుతూ ఎర్ర జెండా వేగుచుక్క కామ్రేడ్ గండు అంతయ్య అని అన్నారు. గీత కార్మిక కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ గండు అంతయ్య నీతికి నిజాయితీకి నిలువుటద్దం చిన్ననాటి నుండే ఎర్ర జెండా పట్టుకుని కడవరకు కమ్యూనిస్టుగా జీవించాడని ఎన్ని కష్టాలు వచ్చినా ఎర్రజెండాని వదల లేదని గీత కార్మికుల సమస్యల కోసం పేద ప్రజల హక్కుల కోసం సాగిన ఉద్యమాలలో తన వంతు సహాయ సహకారాలు ఉండేవని బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. కామ్రేడ్ గండు అంతయ్య, అమరవీరుల ఆశయాలు ముందుకు తీసుకుపోవటం కోసం నిరంతరం పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య, కాసా లచ్చయ్య, శ్రీనివాస్, శేఖర్, వెంకన్న, వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**అర్వపల్లి,ఏప్రిల్ 24,మన సాక్షి:**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేలాది మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ అన్నారు. బుధవారం నాగారం మండలంలోని వర్ధమానుకోట మాజీ సర్పంచ్ బోయిని శోభ లింగమల్లు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలలో వచ్చిన 52,000 ఓట్ల ఆధిపత్యాన్ని లక్ష ఓట్లకు పెంచాలని కోరారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాడని రైతు రుణమాఫీ ఆరు గ్యారెంటీలు అన్నీ కూడా ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తుడుసు లింగయ్య అశోక్ రెడ్డి, సోమన్న, పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎగుమతుల వేగం పెంచాలి

**అర్వపల్లి,ఏప్రిల్ 24,మన సాక్షి:**



ఐకెపి కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని సూర్యాపేట జిల్లా డిఆర్డి ఏ పీ డి, మధుసూదన రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కా ట వివరాలను రవాణా వివరాలను రికార్డులు పరిశీలించి మాట్లాడారు. టాబ ఎంట్రీ త్వరగా చేసినట్లయితే రైతులకు బిల్లులు సకాలంలో వస్తున్నట్లు తెలిపారు. రైతులు నిర్వాహకులు అడిగిన జిరాక్స్ కాపీలను వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వలిశెట్టి మల్లేష్ సీసీ నగేష్ నిర్వాహకులు కృష్ణకుమారి, సంఘం అధ్యక్షురాలు మేకల సునీత రాంబాబు ముదిరాజ్, బైరు సంధ్య, నీలం వీరమ్మ, గుడిసె రమణ, బింగి స్వాతి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ ధరఖాస్తుల ఆహ్వానము

**సూర్యాపేట,ఏప్రిల్ 24,మనసాక్షి:**

జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయము ఆద్వర్యములో 01 మే నుండి 31 మే 2024 వరకు 14 సం॥ లోపు వయస్సు కలిగిన బాల బాలికలకు ప్రాముఖ్యత కలిగిన కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్ అలాగే ఇతర క్రీడల నందు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించబడునని జిల్లా యువజన, క్రీడల అధికారి కె. జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు ఉత్సాహవంతులైన వ్యాయమ ఉపాధ్యాయులు , సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని ఉత్సాహవంతులైన వ్యాయమ ఉపాధ్యాయులు అలాగ్ సీనియర్ క్రీడాకారులు వారు నిర్వహించదలిచిన క్రీడా వివరములు, గ్రామము, ప్రదేశము తెలియపరుచుచూ పూర్తి వివరాలతో తమ దరఖాస్తులను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు గల జిల్లా యువజన, క్రీడల కార్యాలయములో తేది: 27-04-2024 లోపు దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరడమైనది. ఇతర వివరాలకు 9490023949 నెంబరుకు సంప్రదించగలరు.

# ముఖ్యమంత్రి అయ్యే అర్హత కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఉంది



### నామినేషన్ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ

### భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ వేసిన రఘువీర్ రెడ్డి

**నల్లగొండ, ఏప్రిల్ 24, మన సాక్షి:**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ముఖ్యమంత్రి అర్హత ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడారు ఉత్తమ వ్యాఖ్యలకు స్పందిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనకు ముఖ్యమంత్రి కావాలని ఆశ లేదని ఉత్తంకుమార్ రెడ్డి తన మీద అభిమానంతో అలా మాట్లాడారని తాను 11 రోజులు దీక్ష చేసి తెలంగాణ సాధించానని అన్నారు. నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీరారెడ్డి ముందుగా పట్టణంలోని వీటి కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వివేకానంద విగ్రహం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం కలెక్టరేట్ వెళ్లి నామినేషన్ అందజేశారు. నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, సిపిఎం నాయకురాలు మల్లు లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తిప్పర్తి జడ్పిటిసి పాశం రామ్ రెడ్డి పాల్గొన్నారు.



# భర్త గెలుపు కోసం భార్య పోరాటం

### తండ్రి గెలుపు కోసం తనయుని ఆరాటం

**రామసముద్రం,ఏప్రిల్ 24,మన సాక్షి:**

ప్రతి మగాని గెలుపు వెనక ఒక ఆడది ఉంటుందనేది నానుడి. అలాగే పున్నామ నరకం నుండి రక్షించేవాడు పుత్రుడు అనేది పెద్దల మాట. వీటిని నిజం చేస్తూ భర్త గెలుపు కోసం భార్య, తండ్రి గెలుపు కోసం తనయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారు. వారు ఎవరో కాదు మదనపల్లె నియోజకవర్గ ఉమ్మడి టిడిపి అభ్యర్థి షాజహాన్ బాష భార్య గులనాజ్ బేగం,కుమారుడు అక్బారీ . ఒక గృహిణిగా ఒకపక్క భర్తకు సేవ చేస్తూ మరోపక్క భర్త విజయం కోసం గ్రామాల్లో పర్యటించి ,ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తన భర్త 2009 లో ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు మండలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ మరింత అభివృద్ధి కోసం మరోమారు తన భర్త షాజహాన్ ను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. అలాగే షాజహాన్ భాష గెలుపు కోసం కుమారుడు అక్బరి తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా మండలం లో సుడిగాలి పర్యటన చేస్తూ తండ్రి ని ఎమ్మెల్యే చేసి,అసెంబ్లీలో అడుగు పెట్టేలా తీవ్రంగా కృషి చేస్తున్నారు. వీరు ఇరువురు ఓటర్లతో మమేకమై ఓటర్లను ఒక అమ్మగా,ఒక అక్కగా,చెల్లిగా,అన్నగా పలకరించే తీరుకు



ప్రజలు ముగ్దులు అవుతూ తప్పకుండా షాజహాన్ కు ఓటు వేసి,వేయించి గెలిపిస్తామని ప్రజలు వీరికి హామీలు ఇస్తున్నారు. అలాగే మండల టిడిపి శ్రేణులు షాజహాన్ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఉపాధి కోసం స్థాపించిన పరిశ్రమలు గూర్చి,ప్రభుత్వ ఉద్యోగాల నియాకాలగూర్చి,సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాల పంపిణీ తదితర అభివృద్ధి కార్యక్రమాల గూర్చి,అలాగే రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల గూర్చి ప్రజలకు వివరిస్తున్నారు. వీరిలో మండలపార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడు,మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, కృష్ణంరాజు, మాజీ జెడ్పిటిసి శివశంకర్, నాయకులు మండల యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,రాజేష్ స్వామీ,శ్రీకాంత్,జయ కుమార్ శెట్టి,వాహీద్,స్థానికం రాజేష్,బోయ రమనప్ప,వాల్మీకి కిట్ట,మట్లవారిపల్లె కిట్ట పెయింటర్ చాను, గౌనివారిపల్లె రెడ్డెప్పరెడ్డి, అరికెల రెడ్డెప్ప, మాజీ సర్పంచి రెడ్డిశేఖర్, ఒంటెల అల్తాఫ్, డాక్టర్ శివ,ఎల్.శివ,నడింపల్లె రమేష్, జావీద్ ,అధికసంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు.





# పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

### క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

**సూర్యాపేట,ఏప్రిల్ 24,మనసాక్షి:**

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో వెబ్ క్యాస్టింగ్ చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లపై బి.ఎస్.ఎన్. ఎల్, ఎస్.ఎన్. ఆర్. ఏజెన్సీ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదనవు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ 1201 పోలింగ్ కేంద్రాల్లో లోపల వెబ్ క్యాస్టింగ్ అలాగే 187 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో బయట, లోపల భాగంలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వెబ్ క్యాస్టింగ్ పనులు నిర్దేశించిన సమయానికి అందించాలని ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో వెబ్ కెమెరాల పర్యవేక్షణకు బి.ఎల్.ఓ, జి.పి. సెక్రెటరీలకు విధులు కేటాయించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా వెబ్ క్యాస్టింగ్ సిబ్బందికి ఐ. డి కార్డులు అందించాలని సూచించారు. ఇప్పటికే అన్ని క్రిటికల్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచామని అలాగే సంబంధిత ఏజెన్సీ పోలింగ్ కేంద్రాల్లో పనులు చేపట్టాలని బి.ఎస్.ఎం.ఎల్ నెట్ నిరంతరం ఉండాలని ఈ సందర్బంగా సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డి.పి.ఓ సురేష్ కుమార్, బి ఎస్ ఎన్ ఎల్ డి.ఈ రవి ప్రసాద్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, ఎస్.ఎన్. ఆర్. ఏజెన్సీ మహేందర్, ఈ డి ఎం గఫ్ఫార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడరాదు

### బీసీ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

**మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 24, మన సాక్షి:-**



పరీక్షల్లో ఉత్తీర్ణత పొందని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ రాదని బీసీ సంస్కృతిక సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు విద్యార్థి లోకానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మిర్యాలగూడ లో పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. ఎంతో కష్టపడి చదివినప్పటికీ ఒక్కొక్కసారి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేని పరిస్థితులు దాపురిస్తాయని అంత మాత్రం చేత ఎంతో విలువైన జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకోవద్దని, ఇంటర్మీడియట్లో ఒకసారి ఫెయిల్ అయిన వారు ఆ తర్వాత ఐఏఎస్ ఆఫీసర్లు అయిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు కొన్ని ప్రవేశ పరీక్షల ఫలితాల విడుదల నేపథ్యంలో తల్లిదండ్రులు విద్యార్థులు ఆందోళన చెందడం సహజం అని కానీ ఫలితాలకు పొంగిపోకుండా గెలుపోవటంలో శాశ్వతం కాదని ఫలితాలలో విశ్లేషించుకుంటూ ప్రయత్నం మరియు ప్రయాణం కొనసాగాలని ఆయన హితవు పలికారు. విమానాన్ని కనిపెట్టిన రైట్ సోదరులు అనేక సంవత్సరాల తర్వాతే ఫలితాన్ని పొందారని విద్యుత్ బల్బు కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్ జీవితాన్ని ఒకసారి పరిశీలించాలని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాల పాటు శ్రమిస్తేనే చంద్రయాన్ 3 చంద్రుని ఉపరితలాన్ని ముద్దాడిందని విద్యార్థుల ప్రతిభకు మార్కులు మరియు ర్యాంకులు కొలబద్ద కాదు అని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని తమ యావత్ శక్తిని శ్రమలు వారికోసం ధారపోస్తారని అలాంటి వారికి కడుపుకోత మిగిల్చ రాదని ఆయన విద్యార్థులకు హితవు పలికారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.